# కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు


కేసీఆర్‌తో ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్

నేరడిగొండ, జూన్ 24 : ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ నియోజకవర్గ ప్రజల యోగక్షేమాలపై ఆరా తీశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అండగా ఉండాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

# నకిలీ పత్తి విత్తనాల పట్టివేత


పట్టుకున్న నకిలీ విత్తనాలతో ఎస్ఐ రాజేందర్, ఏవో మహేందర్, పోలీస్‌లు


కోటపల్లి, జూన్ 24 : మండలంలోని పంగిడి సోమారంలో 83 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేందర్ తెలి పారు. పంగిడి సోమారంలో కోల కుమార్ నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించగా, 83 కిలోల లూస్ పత్తి విత్తనాలు దొరికాయని ఎస్ఐ తెలిపారు. ఎల్లక్కపేటలోని ఆది శంకరాచార్య కాటన్ జిన్నింగ్ మిల్లు నుంచి దొరప్పనేని శ్రీనివాస్ రావు సరఫరా చేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు. నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడుతున్న కుమార్‌తో పాటు శ్రీనివాస్‌రావుపై కేసు నమోదు చేశామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారం అందించాలని ఎస్ఐ రాజేందర్, కోటపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి మహేందర్ కోరారు.

# ఓసీతో విధ్వంసమేనా?!

- శ్రావణపల్లి కోల్ బ్లాక్ వేలంపై ఆందోళన
- బొందలగడ్డగా మారనున్న లంబాడా గ్రామం
- మామిడితోటలు, పంటలు కనుమరుగయ్యే అవకాశం
- బతికేదెట్లా అంటూ గ్రామస్తుల ఆవేదన
- ఆది నుంచీ వ్యతిరేకత.. పోరాటాలు

*దేశవ్యాప్తంగా 67 బొగ్గు గనుల వేలానికి శ్రీకారం చుట్టిన కేంద్రం, మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలోని శ్రావణపల్లి కోల్ బ్లాక్‌ను సైతం అమ్మకానికి పెట్టడం ఆందోళన కలిగిస్తున్నది. ఓసీ వద్దని కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తుండగా, తాజాగా బీజేపీ ప్రభుత్వ నిర్ణయంతో తమ ఊరు బొందలగడ్డగా మారి బతుకులు ఆగమయ్యేలా ఉన్నాయంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.*


శ్రావణపల్లి గ్రామం



శ్రావణపల్లి ఓసీ నమూనా చిత్రం

నెన్నెల, జూన్ 24 : జండావెంకటాపూర్ గ్రామ పంచాయతీలోని శ్రావణపల్లి పూర్తిగా లంబాడా గ్రామం. ఇక్కడ 85 వరకు ఇండ్లు ఉండగా, 120 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇక్కడున్న వారంతా వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మామిడి తోటలు, వరి, పత్తి పంటలు సాగు చేస్తున్నారు. తమ గ్రామంలో ఓసీ అయితే తామెట్లా బతికేదని ప్రశ్నిస్తున్నారు.

### మామిడి తోటలు.. పంటలు కనుమరుగేనా..

జీవనాధారమైన వందలాది ఎకరాల్లోని మామిడి తోటలతో పాటు వివిధ పంటలు కనుమరుగయ్యే అవకాశముందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. 50 ఏళ్లుగా వివిధ రకాల మామిడి తోటలు ఇక్కడ పెంచుతున్నారు. మామిడితో పాటు యూకలిప్టస్, టేకు, కొబ్బరి, ఎర్రచందనం తోటలు సాగవుతున్నాయి. వరి పంటలు పండించేందుకు ఇంటింటికీ బోరు బావులు ఉన్నాయి. ప్రభుత్వం ఓసీ ఏర్పాటుకు వేలం వేస్తే శ్రావణపల్లి విధ్వంసమవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రావణపల్లి ఓసీలో సుమారుగా 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాలున్నట్లు సింగరేణి ఎక్స్‌ప్లోరేషన్ సంస్థ ద్వారా 1999లోనే గుర్తించారు. ఇక్కడ జీ 10 గ్రేడ్ బొగ్గు ఉన్నట్లు తేలింది. దీని జీవిత కాలము 33 ఏళ్లు. ఓసీ బ్లాక్‌లో అటవీశాఖ ఆధీనంలో ఉన్న భూమి 8.15 స్క్వేర్ కిలోమీటర్లు, 6.54 స్క్వేర్ కిలోమీటర్ల నాన్‌ఫారెస్ట్ భూమి ఉంది. దాదాపు 1937 హెక్టార్ల భూమి అవసరముంది.

### ఓసీ కోసం ప్రాణహిత-చేవెళ్ల కాలువ ప్లాన్ మార్పు

శ్రావణపల్లిలో ఓసీ ఏర్పాటు అవుతుందని అప్పట్లో ఏకంగా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్ కోసం తవ్వే కెనాల్ రూట్‌ను మార్పు చేశారు. 4వ ఫేస్ నుంచి ప్రారంభమయ్యే కెనాల్‌ను మైలారం మీదుగా మందమర్రి మండలం శంకర్‌పల్లి వరకు తవ్వాల్సి ఉంది. మెట్‌పల్లి సమీపంలో కొంత మేర కాలువను తవ్వారు. ఈ విషయం తెలుసుకున్న సింగరేణి సంస్థ ప్రభుత్వంతో మాట్లాడి కాలువను ఓసీ బ్లాక్ ఏరియా నుంచి తప్పించి మరో ప్రాంతం నుంచి తీసుకెళ్లేందుకు సర్వే చేసింది. మైలారం నుంచి కొత్తూర్ మీదుగా ఆవుడం నుంచి శంకర్‌పల్లికి వచ్చేలా ప్లాన్ చేశారు.

### ఆది నుంచీ వ్యతిరేకతే

శ్రావణపల్లి గ్రామంలో సింగరేణి సంస్థ ఎక్స్‌ప్లోరేషన్ సంస్థ 1994 నుంచే ఇక్కడ బొగ్గు నిక్షేపాలను గుర్తించడానికి అన్వేషణ చేపట్టింది. శ్రావణపల్లిలో అన్వేషణ విభాగానికి చెందిన డ్రిల్లింగ్ మిషన్‌ను 1995లోనే మొదటిసారి అప్పటి నక్సలైట్లు వ్యతిరేకించి దగ్ధం చేశారు. ఆ తర్వాత నెమ్మదిగా అన్వేషణ చేపట్టారు. మరోసారి కూడా నక్సల్స్ డ్రిల్లింగ్ విభాగానికి చెందిన యంత్రాలను తగులబెట్టారు. ఇక్కడ సింగరేణి సంస్థ ఉపరితల గనులను చేపట్టవద్దన్న వ్యతిరేకత ప్రజల్లోవచ్చింది. పలుమార్లు అధికారులు గ్రామంలోకి సర్వే కోసం వస్తే అందరినీ బంధించారు. ఎట్టకేలకు సర్వేను పూర్తి చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ కార్మిక సంఘాల వారు ఆందోళనలు చేపట్టారు. ఓసీ వలన జరిగే విధ్వంసాలను రైతులకు వివరించారు. రెండేళ్ల కిందట శ్రావణపల్లి ఓసీని ప్రైవేటీకరణ చేసి వేలం వేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చినా ఒక్కరే వేలంలో పాల్గొనడంతో వాయిదా పడింది. అప్పుడు కూడా పలు కార్మిక సంఘల నాయకులు శ్రావణపల్లికి వచ్చి ఆందోళన చేపట్టారు. ఇప్పుడు మరోసారి శ్రావణపల్లిలో ఓసీ చేపట్టడానికి ముందుకు వస్తుండగా, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

### ఓసీతో మా బతుకులు ఆగమవుతాయి



*మా గ్రామంలో ఓసీ వస్తే మా బతుకులు ఆగమవుతాయి. ఇన్ని రోజులు వ్యవసాయన్నే నమ్ముకుని జీవించినం. ఇక కూడా తాము ఇక్కడే ఉంటాం. మామిడి తోటలు, వరి పొలాలు విడిచి ఎక్కడికి వెళ్లి పోవాలి. చెట్టుకొకరం పుట్టకొకరం అవుతాం. ఇన్నాళ్లు అన్నదమ్ముళ్లా కలిసి జీవించినం. ఓసీ వస్తే జీవితాలు బుగ్గిపాలు అవుతాయి.*

**- భూమయ్య, రైతు, శ్రావణపల్లి**

### ఓసీ వద్దే వద్దు



*మాకు ఓసీ వద్దే వద్దు. ఓసీ వస్తే మా జీవితాలు నాశనం అవుతాయి. మా పిల్లలు ఎట్లా బతుకుడు. ఇక్కడే పుట్టాం, ఇక్కడే ఉంటాం. ఈ ఓసీతో ఆగమవుతాం. మాకు ఎవుసం తప్ప ఏ పనీ రాదు. మా భూములకు ఎంత పరిహారం ఇచ్చినా లాభం లేదు. ఏండ్ల తరడిగా పెంచిన మామిడి తోటలు మళ్లా ఎన్నేండ్లకు చేతికి రావాలె. ఎవరేం చేసినా మా ఊరును వల్లకాడు కానివ్వం.*

**- మాలోత్ రాంచందర్, శ్రావణపల్లి**



# మళ్లా కరెంట్ కష్టాలు

**తెలంగాణ రాకముందు ఎట్లుండెనో గట్లనే..**

- ఎప్పుడు పడితే అప్పుడు కోతలు పెడుతున్నరు
- కేసీఆర్ సర్కారులో రంది లేకుంట ఎవుసం చేసినం
- యేటా రెండు.. మూడు పంటలు తీసినం
- 'నమస్తే తెలంగాణ'తో రైతుల మనోగతం

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : 'తెలంగాణ రాష్ట్రం రాక ముందు కరెంటు ఎప్పుడు వచ్చేదో.. ఎప్పుడు పోయేదో తెలిసేది కాదు. కరెంటుపై అసలు గ్యారంటీ ఉండేది కాదు. రాత్రీ.. పగలూ పొలాల కాడ ఉండి నీళ్లు పారిచ్చేటోళ్లం. ఒక్క వానకాలం పంటే తీసేది. ఇగ ఎండా కాలంలో పొలాలన్నీ బీళ్లుగానే ఉండేటివి. ఆనాడు నరకం చూసినం. ఇక వెల్డింగ్, మెకానిక్‌వంటి దుకాణాలు నడిపించే వారికి గిరాకీలుండేటివి కావు. కరెంట్ కోతల వల్ల అనేక పరిశ్రమలు మూతపడ్డయ్. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయినంక 24 గంటల ఉచిత కరెంటిచ్చిన్రు. రైతులందరం పదేండ్ల పాటు రంది లేకుంట ఎవుసం చేసుకున్నం. యేటా రెండు.. మూడు పంటలు కూడా తీసినం. నిరంతర విద్యుత్‌తో చిరువ్యాపారులకు సైతం చేతినిండా పని దొరికింది. ఇదంగా కేసీఆర్ గొప్పతనమే. గాయనలెక్క మంచి పనులు చేసినోళ్లు లేరు. ఇప్పుడు కాంగ్రెసోళ్లు అధికారంలోకి వచ్చినంక మళ్లా కరెంట్ కష్టాలు మొదలైనయ్. ఎప్పుడు పడితే అప్పుడు కోతలు పెడుతున్నరు. యాసంగిలో పంటలు ఎండిపోయినయ్. గీ వర్షాకాలంలో కూడా కరెంటు సరిగా ఇస్తరో.. ఇవ్వరోనని భయమైతంది.' అని రైతులు అభిప్రాయపడుతున్నారు.

### ఇగ గిట్లయితే పంటలు తీసినట్లే..



*తెలంగాణ రాకముందు కరెంటు కష్టాలు అనుభవించినం. కరెంటు ఎప్పుడు వచ్చేదో.. ఎప్పుడు పోయేదో తెలిసేది కాదు. పంటలేసి మస్తు నష్టపోయినం. కొందరైతే ఎవుసం ఇడిసిపెట్టి కూలీ పనులకు పోయిన్రు. మన రాష్ట్రం వచ్చి కేసీఆర్ సీఎం అయినంక రైతుల బాధలు తీర్చిండు. 24 గంటలు కరెంటిచ్చి ఢోకా లేకుంట చేసిండు. ఎవుసాన్ని పండుగలా చేసిండు. రంది లేకుంట పంటలు తీసినం. ఇగ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మళ్లా బాధలు మొదలైనయ్. ఇష్టం వచ్చినట్లు కరెంట్ కోతలు పెడుతున్రు. మస్తు గోస పెట్టుకుంటున్నరు. ఇగ గిట్లయితే పంటలు తీసినట్లే. కరెంటిచ్చుడు చేతగాక రాజకీయ కక్షతో కేసీఆర్ సార్‌ను బదునాం చేస్తున్నరు.*

**- జాటోత్ శంకర్, బర్రెపెల్లి, దహెగాం మండలం**

### పదేండ్లు రంది లేకుండె



*2014 కంటే ముందు కరెంటు లేక అష్టకష్టాలు పడ్డం. కరెంటు లేక, లో ఓల్టేజీతో మోటర్లు కాలిపోయేవి. రైతులు అరిగోస పడుతున్నా పట్టించుకునేవాళ్లు కాదు. కాలిపోయిన కరెంటు మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు రిపేరు చేయించుకునేందుకు తిప్పలపడేటోళ్లం. తెలంగాణ వచ్చినంక మా గోస తీర్చింది కేసీఆరే. 24 గంటల పాటు కరెంటిచ్చిండు. పదేండ్లు రంది లేకుంట పంటలు తీసినం. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంక మళ్లా కరెంట్ కోతలు పెడుతున్నరు. పంటలు పండుతయన్న గ్యారెంటీ లేకుంటైతంది. ఎట్లా బతుకుడో.. ఏమో ఇగ.*

**- నగేశ్, రైతు, పెంచికల్‌పేట్**

# మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ బదిలీ


అదనపు కలెక్టర్ రాహుల్

నస్పూర్, జూన్ 24 : మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2020లో సివిల్స్‌లో అదనపు కలెక్టర్‌గా ఎంపికైన రాహుల్, జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థుల కోసం లైబ్రరీలను ఆధునీకరించి సౌకర్యాలు కల్పించారు.


గ్రీవెన్స్‌కు నామమాత్రంగా హాజరైన వివిధ శాఖల అధికారులు

# ప్రజావాణికి అధికారుల డుమ్మా

- కలెక్టర్ సీరియస్
- దాదాపు 20 శాఖల నుంచి హాజరుకాని ఉద్యోగులు
- షోకాజ్ నోటీసులకు వెంకటేశ్ ధోత్రే ఆదేశాలు
- జిల్లాలో పెండింగ్‌లో 2,781 దరఖాస్తులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణికి డుమ్మాకొట్టిన అధికారులపై కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సీరియస్ అయ్యారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు దాదాపు 20 శాఖలకుపైగా అధికారులు హాజరుకాకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు హాజరుకాకుండా కిందిస్థాయి ఉద్యోగులను పంపడమేమిటని మండిపడ్డారు. గైర్హాజరైన వారికి వెంటనే షోకాష్ నోటీసులివ్వాలని, గైర్హాజరుకు గల కారణాలపై సంజాయిషీ తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

### పెండింగ్‌లో 2,781 దరఖాస్తులు

ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించడంలో ప్రజావాణికి ప్రత్యేకత ఉంది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌కు స్వయంగా కలెక్టర్ హాజరవుతున్నా వివిధ శాఖల ఉద్యోగులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉండగా, చాలా కాలంగా గ్రీవెన్స్ జరుగలేదు. దీంతో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ సోమవారం పెద్ద ఎత్తున గ్రీవెన్స్‌కు తరలివచ్చారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఆయాశాఖల అధికారులకు ఇచ్చేందుకు పిలువగా చాలా మంది గైర్హాజరయ్యారు. ఆయా శాఖల్లో కింది స్థాయిలో పనిచేసే సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్లను పంపడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, జిల్లాలో గ్రీవెన్స్‌లో స్వీకరించిన దరఖాస్తులు 2,781 పెండింగ్‌లో మూలుగుతున్నాయి. గ్రీవెన్స్‌లో స్వీకరించిన అర్జీలు నెలల తరగబడి పెండింగ్‌లో ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలు ఎప్పటికీ పరిష్కారమవుతాయో.. అసలు కావేమోనని ఆందోళన చెందుతున్నారు.

# 'ప్రజాపాలన'కు మరోసారి

- లోపాల నేపథ్యంలో తిరిగి దరఖాస్తులు చేసుకుంటున్న లబ్ధిదారులు
- ఇప్పటికైనా ఎంపిక చేస్తారో లేదోనని ఆందోళన



మున్సిపాలిటీ కార్యాయంలో దరఖాస్తులు చేసుకుంటున్న మహిళలు

చెన్నూర్, జూన్ 24 : ప్రజాపాలన లబ్ధిదారుల ఎంపికలో పలు లోపాలు తలెత్తగా, మరోసారి దరఖాస్తులు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు గ్యారంటీల అమలు లో భాగంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు అధికారులు ప్రజల వద్దకే వచ్చి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వీటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. ఆపై 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే అధికారుల నిర్లక్ష్యమో.. లేక ఎక్కడ లోపం జరిగిందోగానీ.. అనేక మంది అర్హులకు ఈ రెండు గ్యారంటీలు అమలు కాలేదు. దీంతో ఎంపికకాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరింది. ఈ క్రమంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణ నిలిపేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగియడంతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తిరిగి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రజాపాలన రసీదుతో పాటు కరెంటు బిల్లు, గ్యాస్ బుక్‌కు సంబంధించిన జిరాక్స్ కాపీలతో తిరిగి దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో జిరాక్స్ సెంటర్లు, కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వస్తుంది. మొదటే స్వీకరించిన దరఖాస్తులను అధికారులు సక్రమంగా ఆన్‌లైన్‌లో పొందుపర్చితే ఇప్పుడు మరోసారి దరఖాస్తు చేసుకునే పనే ఉండేది కాదని, ఇప్పుడైనా ఆ రెండు పథకాలకు ఎంపికవుతామో లేదోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి చేయాల్సింది పోయి దీక్షలా?

- అధికార పార్టీ కనుసన్నల్లో పోలీసు వ్యవస్థ
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్పీ
- అందెవెల్లి పెద్ద వాగు బ్రిడ్జి పరిశీలన


బెజ్జూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, జూన్ 24 : నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయాల్సిన ఎమ్మెల్యే దీక్షలు చేయడం ఎంత వరకు సమంజసమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అందెవెల్లి పెద్దవాగు బ్రిడ్జిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సకాలంలో అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో తాత్కాలికంగా నిర్మించిన వంతెన కొట్టుకుపోయిందని, దహెగాం, భీమిని మండలాల్లోని 54 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. అనంతరం బెజ్జూర్ మండలంలోని పలు గ్రామాలాల్లో తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం బెజ్జూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ బెజ్జూర్ మండలం సోమిని, తాలయి, అంబగట్టు గ్రామాల్లో పోలీసు వ్యవస్థ అధికార పార్టీ కనుసన్నల్లో కొనసాగుతుందన్నారు. పేదల భూములను ఆక్రమిస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉన్నాయని పలువురు బెజ్జూర్ ఎస్ఐ దృష్టికి తీసుకెళ్తే.. అవి ఒరిజనల్స్ పట్టాలా.. లేక డూప్లికేట్ పట్టాలా అని బెజ్జూర్ ఎస్ఐ తహసీల్దార్‌కు లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు రాంప్రసాద్, రాజ్‌కుమార్, యాదవ్, అంజన్న, శేఖర్, చిన్నయ్య పాల్గొన్నారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679